సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



రసూల్‌పురా: రాష్ట్రంలోని పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం ఆయన పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



లాలాపేట: తెలంగాణ వెటరన్స్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో 2వ తెలంగాణ వెటరన్స్ ర్యాంకింగ్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్ కుసుమ, కార్యదర్శి నవీన్ కుమార్,మురళీ హరినందన్ బాబు తదితరులు ఉన్నారు.

పేదలకు అన్నదానం

రాంగోపాల్‌పేట్: సమాజ్‌వాది పార్టీ మాజీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ జయంతిని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ వద్ద పార్టీ నేతలు నిత్య కళ్యాణ్, నర్సింగ్ మాదిగ పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు ములాయం సింగ్ యాదవ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అట్టడుగు వర్గాలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. అఖిలేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ మరో మారు యూపీలో విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మాలల ఐక్యత కోసమే సింహగర్జన సభ



ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జన సభ ఎవరికీ వ్యతిరేకం కాదని ఐక్యత కోసమే అని పలువురు నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సింహగర్జన సభ వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాల సంఘాల జేఏసీ కన్వీనర్ సర్వయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి మాలలు సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రొ. సాద నవీన్, శంకర్, మందాల భాస్కర్, నామా సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనం

గాంధీఆస్పత్రి: ర్యాగింగ్ కు పాల్పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీ వివేకానంద ఆడిటోరియంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు లీగల్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడకుండా జూనియర్లకు గైడెన్స్ ఇస్తూ, సీనియర్లు ఆదర్శంగా నిలవాలన్నారు. ర్యాగింగ్ పేరిట వికృత చేష్టలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యులను కాలేజీ, హాస్టళ్ల నుంచి సస్పెండ్ చేయడంతోపాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ అరుణకుమారి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్స్ రవిశేఖర్ రావు, వాలియా, కృపాల్ సింగ్, సంగీత, వినోద్, ఎంపీహెచ్ వేణుగోపాల్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో పెదనాన్నపై యువకుడి దాడి

అడ్డగుట్ట: మద్యం మత్తులో సొంత పెదనాన్నపై ఓ యువకుడు బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అడ్డగుట్ట, మొండిబండ నగర్‌కు చెందిన బుచ్చమ్మ కుమారులు మల్లికార్జున్, రాకేష్ రాణిగంజ్‌లోని హార్డ్‌వేర్ షాపులో పని చేస్తుంటారు. శుక్రవారం తమ ఇంటి వద్ద బంధువు రాజు దినకర్మ నేపథ్యంలో అందరూ మద్యం సేవించారు. మల్లికార్జున్ మద్యం మత్తులో కుటుంబసభ్యులతో గొడవ పడుతుండటంతో అతడి పెదనాన్న శ్రీనివాస్ అతడిని అడ్డుకునేందుకు యత్నించాడు. దీంతో మల్లికార్జున్ పక్కనే ఉన్న బ్లేడ్‌తో శ్రీనివాస్‌పై దాడి చేయడంతో కడుపు, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన మల్లికార్జున్‌తో పాటు రాకేష్, బుచ్చమ్మలపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కంభం ప్రాంతానికి చెందిన ఆరపాటి హరికృష్ణ బల్కంపేట రేణుకా బిల్డింగ్‌లో ఉంటూ ఎగ్ కుల్ఫీ వెండర్‌గా పని చేస్తున్నాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న జాబ నవీన్ ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు, సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించిన వీరు తుని ప్రాంతానికి చెందిన అశోక్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి నగరంలో తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం 3.5 కిలోల గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం వారి ఇంట్లో సోదాలు నిర్వహించారు. వారి నుంచి 3.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా గంజాయి వినియోగిస్తున్న మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. 2 సెల్ ఫోన్లు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యమం..ఉధృతం..

- అన్యాయంపై నిరసన గళం
- సికింద్రాబాద్ జిల్లా కోసం ఆందోళనలు
- సాధించి తీరుతామంటున్న ఉద్యమకారులు
- న్యాయం కోసం నినదిస్తున్న లష్కర్ ప్రజలు

మీతో సాక్షి

సికింద్రాబాద్ ప్రాంత ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి నిరసనలుగా మారి మళ్లీ లష్కర్ ప్రత్యేక జిల్లా ఉద్యమం ఊపందుకుంది. లష్కర్ ప్రత్యేక జిల్లా సాధన సమితి పేరుతో ఆవిర్భవించిన ఉద్యమం క్రమేణా ఉధృతం అవుతున్న నేపథ్యంలో 'సాక్షి' 'మీతో సాక్షి' కార్యక్రమాన్ని నిర్వహించింది. సికింద్రాబాద్ క్లాక్‌టవర్, ఖైరతాబాద్ గణపతి వేదిక వద్ద ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది.ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సమితి ప్రతినిధులు, ఈ ప్రాంత ప్రజలు స్పష్టం చేశారు.

-సికింద్రాబాద్/రాంగోపాల్‌పేట్



సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద ఆందోళన చేస్తున్న లష్కర్ సాధన సమితి ప్రతినిధులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో సికింద్రాబాద్ నగరానికి అన్యాయం జరిగిందనే వాదన ఈ ప్రాంత ప్రజల్లో బలంగా నెలకొంది. అప్పట్లో సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. కలెక్టరేట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన కూడా చేశారు. అయితే హైదరాబాద్ జిల్లా ప్రాధాన్యం తగ్గుతుందన్న ఒకే ఒక్క కారణంతో సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం స్వస్తి పలికిందన్న ఆరోపణలు ఉన్నాయి.

- రాష్ట్రంలో రెండు, మూడు నియోజకవర్గాల పరిధితో కొత్త జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రాత్మక సికింద్రాబాద్ నగరాన్ని జిల్లాగా ఏర్పాటు చేయకపోవడం పట్ల లష్కర్ ప్రజల్లో నిరసనలు మొదలయ్యాయి. ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సికింద్రాబాద్‌ను హైదరాబాద్‌లో విలీనం చేసి ఒకమారు, జిల్లా ఏర్పాటు చేయకుండా మరోమారు ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని అప్పట్లో వివిధ రంగాల ప్రతినిధులు నిరసనలు చేపట్టారు.

అమలుకు నోచుకోని విలీన షరతులు

- సికింద్రాబాద్ నగరానికి 1960 నుంచి జరుగుతున్న వరుస అన్యాయాలు, వివక్షతో క్రమేణా ప్రాభవం తగ్గిందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిలోనూ పూర్తిగా వెనుకబడిందని వారు పేర్కొంటున్నారు. ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు.
- విలీనం నాటి నుంచి ఇప్పటి వరకు పన్నుల రూపంలో ఇక్కడి నుంచి గణనీయమైన ఆదాయం చేకూరుతున్నా అభివృద్ధి పనులకు మాత్రం ఆశించిన మేర నిధులు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కార్పొరేషన్‌ల విలీనం సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ల నియామకం, నిధుల కేటాయింపు తదితర అంశాలపై రూపొందించిన షరతులను విస్మరించారన్న వాదనలున్నాయి.

ప్రత్యేక ప్యాకేజీని మరిచారు...

- బేగంపేట విమానాశ్రయం, గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా యూనివర్సిటీ, పలు రైల్వేస్టేషన్ల తోపాటు ప్యారడైజ్, మోండా మార్కెట్, జనరల్‌బజార్, రాణిగంజ్ వంటి చారిత్రాత్మక వ్యాపార వాణిజ్య కేంద్రాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రహదారులు, ట్రాఫిక్ సమస్యలు యధాతథంగా ఉండడం ఈ ప్రాంత ప్రజలను అసంతృప్తికి గురి చేస్తున్నాయి.
- సికింద్రాబాద్ నగరం 200 సంవత్సరాలు నిండిన నేపథ్యంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ద్విశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించి అభివృద్ధి కోసం రూ.200 కోట్ల ప్యాకేజీని ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. ద్విశతాబ్ది వేడుకల సందర్భంగా అయినా ప్రత్యేక ప్యాకేజీతో ఈ ప్రాంతంలో ఓ మోస్తరు అభివృద్ధి జరుగుతుందని ఆశించిన ప్రజలకు భంగపాటే ఎదురైంది.



ఖైరతాబాద్ గణపతి వేదిక సాక్షిగా..

ప్రత్యేక జిల్లాకు అర్హతలు ఇవీ..

పరిధి: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం
అసెంబ్లీ నియోజకవర్గాలు (7) :
సికింద్రాబాద్, ముషీరాబాద్,
అంబర్‌పేట్, ఖైరతాబాద్,
నాంపల్లి, జూబ్లీహిల్స్, సనత్‌నగర్.
మున్సిపల్ డివిజన్లు: 42

ప్రత్యేక జిల్లాతోనే న్యాయం



నగరాల అభివృద్ధిలో నా బాల్యం నుంచి సికింద్రాబాద్‌కు ప్రాధాన్యం దక్కలేదు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాల న్యాయం జరిగే అవకాశం ఉంది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు రావడం ద్వారా ఈ ప్రాంతం సత్వర అభివృద్ధి సాధిస్తుంది. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది. దశాబ్దాల కాలంగా జరుగుతున్న అసమానతలను సవరించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

-విజయ్‌కుమార్,
సికింద్రాబాద్ సీనియర్ సిటిజన్

ఉద్యమానికి అనూహ్య స్పందన



జిల్లా సాధన సమితి చేపట్టిన ఉద్యమానికి సికింద్రాబాద్ ప్రాంత ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తుంది. ఏడాది కాలంగా సికింద్రాబాద్ ప్రాంతానికి జరిగిన అన్యాయాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశాం. ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించాం. మున్ముందు ఆందోళనలు ఉధృతం చేస్తాం.

-సాదం బాల్‌రాజ్‌యాదవ్,ప్రధాన
కార్యదర్శి జిల్లా సాధన సమితి

ప్రభుత్వంపై ఒత్తిడితో సాధిస్తాం



ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ద్వారా సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లాను సాధించుకుంటాం. ఇప్పటికే రాష్ట్ర, కేంద్ర మంత్రులు, శాసనసభ్యుల మద్దతును కూడగట్టాం. ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలను జాగృతం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తున్నాం. జిల్లా సాధన జరిగే వరకు నిరంతర ఆందోళనలు కొనసాగిస్తాం.

-గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, అధ్యక్షుడు
జిల్లా సాధన సమితి

విలీనంపై చొరవ చూపండి

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సేవలు అందుతాయని కంటోన్మెంట్ వికాస్ మంచ్ సంస్థ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంటరీ డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ రాధ మోహన్ సింగ్‌కు లేఖ రాశారు. నిధులు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాల కొరత కారణంగా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలోని 4.5 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ లో కంటోన్మెంట్ విలీనం అంశంపై జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. రక్షణ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విలీనం అంశంపై పురోగతి సాధించినా విలీన ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. నవంబర్ 21న పార్లమెంటరీ డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ లోని మొత్తం 31 మంది సభ్యులకు విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని లేఖలు రాసినట్లు వికాస్ మంచ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఆర్మీ అధికారుల కారణంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలంగాణ, ఆంధ్ర సబ్‌ఏరియా (టాసా) బ్రిగేడియర్, కంటోన్మెంట్ అధ్యక్షులు నంజుదేశ్వర్ తెలిపారు. శుక్రవారం సబ్ ఏరియా కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బ్రిగేడియర్‌ను కలిసి ఒకటవ వార్డు పెన్షన్ లైన్ నుంచి ఫైజాన్ స్కూల్ వరకు, ఏడవ వార్డులో లాల్‌బజార్ హనుమాన్ దేవాలయానికి, ఐదవ వార్డులో 108 బజార్‌లో ఆర్మీ అధికారులు ఏర్పాటు చేసిన గేట్ లను తొలగించి స్థానిక ప్రజల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నంజుదేశ్వర్ మాట్లాడుతూ పది రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళి ముదిరాజ్, నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

లాలాపేట: అప్సా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతినగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హోలిస్టిక్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది దాదాపు 150 మందికి ఈసీజీ,, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీనారాయణ, వీరనాయక్, జయరాజ్, స్థానికులు దాసరి శ్యామ్ సుందర్, కిరణ్, సురేష్, అప్సా ప్రతినిధులు పాల్గొన్నారు.

26న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ

బన్సీలాల్‌పేట్: భారత రాజ్యాంగం ఆమోదం పొందిన నవంబర్ 26ను పురస్కరించుకుని తెలంగాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ యువజన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువక కేంద్ర సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ విజయరావు తెలిపారు. శుక్రవారం కవాడిగూడలోని పీఐబీలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ర్యాలీలో యువజన సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. భారత రాజ్యాంగం విశిష్టతను, ప్రత్యేకతలను వివరించేలా ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ నెల 25 నుంచి 30వరకు నగరంలోని కో-ఆపరేటివ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కాశ్మీరి యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారిణి కుష్బూ గుప్తా వెల్లడించారు. జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్, కుప్వారా, బుద్గాం, బారాముల్లా, శ్రీనగర్, పుల్వామా తదితర జిల్లాలకు చెందిన 132 మంది యువత కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఆర్ విజయరావు తదితరులు

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోస్టర్ ఆవిష్కరణ

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం ద్వారా దేశంలో యువతను సమీకరించి వారి ఆలోచన విధానాన్ని తెలుసుకుని దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని భారత క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ నిషా విద్యార్థి అన్నారు. 2025 జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సుమారు 3వేల మంది యువతతో ముఖాముఖి అవుతారన్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5 వరకు అఖిల భారత డిజిటల్ క్విజ్ పోటీలతో వికసిత్ భారత్ ఛాలెంజ్ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఒలింపిక్ విజేత, అర్జున, పద్మశ్రీ పురస్కారాల గ్రహీత ఎన్. ముఖేష్ కుమార్, ద్రోణాచార్య పురస్కార గ్రహీత ఎన్. రమేష్, ఆసియా పతక విజేత నందినీ అగర్సర, జిల్లా యువజన అధికారిణి ఖుష్బూగుప్తా తదితరులు పాల్గొన్నారు.

24న విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు

సనత్‌నగర్: విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలను ఈ నెల 24న బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే పుస్తక ప్రదర్శనతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆవుల మంజులత, ఆలిండియా రేడియో రిటైర్డ్ ప్రోగ్రాం హెడ్ సుమనస్పతిరెడ్డి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి విశ్వనాథ సత్యనారాయణ రచనల్లో 'హాస్య రసం' పై జరిగే సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమీ (సలహా బోర్డు) కన్వీనర్ ఆచార్య మృణాళినితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ కొండల్‌రావు వెల్చాలతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలదండ నిత్యానందరావు, తనికెళ్ల భరణి, ఓలేటీ పార్వతీశం తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి చేతుల మీదుగా 'పూర్ణత్వపు పొలిమేరలో..'(సంక్షిప్తం) ఆవిష్కరణ, చేవూరు సుబ్బారావుచే 'సమ్మాన్యుడు' (సంక్షిప్త) ఆవిష్కరణ, ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అధ్యక్షతన 'తెలంగాణతో విశ్వనాథ అనుబంధం' పై జరిగే సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ కొండలరావు వెల్చాల పాల్గొంటారు.

జాతీయ స్థాయి సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్స్ ప్రారంభం

లాలాపేట: తార్నాక ఫోరం ఫర్ సీనియర్ సిటిజన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఫర్ స్పోర్ట్స్, గేమ్స్, నాగార్జున నగర్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న 3వ టోర్నమెంట్ శుక్రవారం తార్నాకలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రూపొందించిన స్పోర్ట్స్ అసోసియేషన్ పతాకాన్ని ఓయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. తిరుపతిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ తమలోని క్రీడా స్ఫూర్తిని మరోసారి చాటుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది సీనియర్ సిటిజన్లు హాజరయ్యారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం పరిశీలించారు. సుభాష్‌నగర్ ప్రాంతంలోని డబుల్ బెడ్రూమ్ సముదాయం వద్ద వరదనీటి పైప్‌లైన్ పనులు, శ్రీనివాస్‌నగర్, మోహన్ రెడ్డి నగర్‌లో చేపట్టిన సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు శ్రీ హర్ష హైస్కూల్ వద్ద రోడ్డు పరిస్థితిపై కార్పొరేటర్‌కు వివరించారు. దీనిపై ఆమె స్పందిస్తూ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కొందరు అభ్యంతరం చెప్పడంతో పనులను ప్రారంభించలేదన్నారు. స్థానికులు ఏకాభిప్రాయానికి వస్తే రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. అప్పటి వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మోహన్‌రెడ్డి నగర్ రోడ్డు నిర్మాణంలో సీవరేజీ, వాటర్ లైన్లు దెబ్బతిన్నాయని వాటిని వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. రెడ్ క్రాస్ హాస్పిటల్ సమీపంలోని పార్క్‌లో చిల్డ్రన్ పార్కును, వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, వాటర్ వర్క్స్ మేనేజర్ నవ్య, హార్టికల్చర్ విభాగం అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గంలోని 229 పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్ పేట, మోండా డివిజన్ల పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ) పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉండనున్నారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా గత నెల 29న ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేసిన విషయం విదితమే. ఆ మేరకు అభ్యంతరాల స్వీకరణతో పాటు జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండుతున్న వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాల్లో జరిగే ఓటరు నమోదు కేంద్రాల్లో బీఎల్‌ఓల వద్ద ఫారం 6, 7, 8లను తీసుకుని కొత్తగా ఓటరు నమోదుతో పాటు సవరణ, మార్పులు చేర్పులు చేసుకోవచ్చు.

పేద విద్యార్థులకు కంటి పరీక్షలు



రసూల్‌పురా: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తున్నామని రోటరీక్లబ్ కంటోన్మెంట్ అధ్యక్షురాలు మంజుగుప్తా తెలిపారు. బొల్లారం త్రిశూల్‌పార్క్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ కంటోన్మెంట్, జనహిత సేవా ట్రస్ట్, ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో 215 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, 150 మంది విద్యార్థులకు హిమ గ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి త్వరలో ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విక్రమాదిత్య, ఇన్‌చార్జి హెచ్ఎం విజయ సారథి, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ ఎస్. రామచంద్ర, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నందకుమార్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

24న బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్తీక వన సమారాధన

సనత్‌నగర్: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్ఎస్ఎస్), తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 24న సనత్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో కార్తీక వన సమారాధన నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్తీక సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇదే వేదికపై 120 మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ, 50 మంది పేద విద్యార్థులకు ఆర్థిక మద్దతు, ఐదుగురు పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రవణ్, సరళ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.



కార్తీక వన సమారాధన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెల్లాల రామ్మోహన్

చిన్నజీయర్ స్వామికి ఆహ్వానం..

వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిని ఆహ్వానించారు. కార్యక్రమానికి హాజరై బీఎస్ఎస్ఎస్ ద్వారా ల్యాప్‌ట్యాప్‌లు, ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థినీ విద్యార్థులను ఆశీర్వదించాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే వారికి అనుగ్రహ భాషణం చేయాల్సిందిగా ఆయనకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే శాంతిభద్రతల పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్: ప్రజల భాగస్వామ్యంతోనే శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ సాధ్యమని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. శుక్రవారం మహంకాళి డివిజన్ పరిధిలోని బంగారు, వస్త్ర వ్యాపారులతో ఆమె పీజీరోడ్‌లోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేస్తున్నామని, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే బంగారు, వస్త్ర వ్యాపారుల వివరాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. సైబర్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, అత్యవసర సమయాల్లో ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వస్త్ర దుకాణాలకు చెందిన వ్యాపారులు తమకు ఎదురవుతున్న సమస్యలను డీసీపీ దృష్టికి తీసుకుని రాగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసులతో చర్చించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్‌లు నర్సింగ్‌రావు, రాఘవేందర్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.